# 6

# "ఆయన బోధ వినుచుండెను"

యేసుకు మంచి స్నేహితుడైన లాజరును అతని యిద్దరు అక్కచెల్లెళ్లు మార్త, మరియలును యెరూషలేమునకు సమీప గ్రామమైన బేతనియలో నివసించారు. యేసు ఆ మార్గాన పోతున్నప్పుడు, వారి గృహమే ఆయన గృహం. ఒకసారి, యేసును, ఆయన శిష్యులను మార్త తన యింటికి ఆహ్వానించింది (లూకా 10:38-42). ఈ విషయంలో యేసు ఏం చెప్తాడో ఆమె వినాలని అనుకుని ఉండచ్చు, కాని "విస్తారమైన పనులవలన" ఆమెకు తొందర కలిగినది (40ఎ వ.).

ఆచార ప్రకారం, పురుషులు ఒక చోట మాట్లాడుకొంటూ ఉండగా, యింట స్త్రీలు అతిథులకు భోజనం తయారు చేస్తుంటారు. అవసరమైన పని ఉంటే తప్ప పురుషులు మాట్లాడుకొంటుండే గదిలోనికి స్త్రీలు సాధారణంగా పోరు. ఆచార సంబంధ కార్యాలను మార్త చేస్తుంది. మంచి అతిథి సత్కార్యాన్ని ఆమె ఇవ్వనెంచింది. మరియ కూడ అదే చేయాలని మార్త ఎదురుచూస్తుంది. మరియ యేసు పాదముల వద్ద కూర్చుండి ఆయన బోధ వినుచున్నందుకు మార్త ఆశ్చర్యపడియుండవచ్చు. పురుషులతో పాటు ఆ గదిలో కూర్చుండియుండడం మాత్రమే గాక, వచ్చినవారికి భోజనాలు తయారుచేయడంలో తనవంతు సహాయం చేయనందుకు కూడ మార్త ఆమె విషయంలో ఆశ్చర్యపడింది.

మరియ ప్రవర్తనచేత కలతచెందినదై, మార్త యేసుతో యిలా అంది, "ప్రభువా, నేను ఒంటరిగా పని చేయుటకు నా సహోదరి నన్ను విడిచిపెట్టినందుకు, నీకు చింతలేదా? నాకు సహాయము చేయుమని ఆమెతో చెప్పుము" (40బి వ.). మార్త సిద్ధపరచే భోజనాన్ని తీసికొనే దానికంటెను, ఆత్మసంబంధమైన ఆహారము వారికి యిచ్చుటలో ఆయన శ్రద్ధ కలిగియుండినట్టు ప్రభువైన యేసువారి జవాబు సూచిస్తుంది, "అందుకు ప్రభువు - మార్తా, మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడుచున్నావు గాని అవసరమైనది ఒక్కటే. మరియ ఉత్తమమైనదానిని ఏర్పరచుకొనెను; అది ఆమె యొద్దనుండి తీసివేయబడదని ఆమెతో చెప్పెను" (41, 42 వచనాలు).

మరియ కోరుకున్న "ఉత్తమమైనది" దేవుని వాక్యమనే భోజనంలో పాలుపొందడమే. మార్త ఆందోళన చెడు కాదు. తననుండి సహజంగా ఏమి ఎదురు చూడబడుతుందో దాన్ని ఆమె చేస్తుంది. అయినా, మరియ కోరుకున్నది ఉన్నతమైనది. "ఆయన బోధ వినుటనుండి" ఆమెను వేరు చేయాలని ఆయన తలంచలేదు (39బి వ.). శరీర సంబంధమైన ఆహారంకంటెను, ఆత్మసంబంధమైన ఆహారాన్ని ఆయన పైగా ఉంచినది యిప్పుడు మాత్రమే కాదు. బావి వద్ద (సమరయ) స్త్రీతో ఆయన మాట్లాడిన తరువాత, తినడానికి ఆయన శిష్యులు ఆయనకొరకు ఏదో తెచ్చారు. అప్పుడాయన, "-భుజించుటకు మీకు తెలియని ఆహారము నాకు ఉన్నదని వారితో" చెప్పారు (యోహాను 4:32).

తరువాత, (వేరొక సందర్భంలో) తనను, తన సందేశాన్ని, “పరలోకమునుండి దిగివచ్చి, లోకమునకు జీవమునిచ్చునది దేవుడనుగ్రహించు ఆహారమైయున్నదని” ఆయన పోల్చుకున్నాడు (యోహాను 6:33). ఆయన పరలోకమునుండి దిగివచ్చిన ఆహారమై యున్నాడు (యోహాను 6:41).

## దేవుడు నేడు మాట్లాడుతున్నాడు

ఇంతవరకు మనం చదివిన ఆరాధనా కార్యక్రమాల్లో ఆరాధికుడు దేవునితో మాట్లాడేవే అధికంగా ఉన్నాయి. ప్రార్థనలోను, స్తుతి చేయడంలోను, అన్యోన్య సహవాసంలోను ఉద్వేగ సంబంధమైన “తిరిగి పొందే” ఉపకారాన్ని మనం పొందనారంభించాం. అయితే, చదవడం, ఉపదేశించడం లేక ప్రసంగించడం ద్వారా లేఖనాలు తెరువబడేవరకు స్పర్శకు అందే విధానంలో దేవుడు మనతో మాట్లాడాడు.

నేడు కొన్ని స్థలాల్లో, ప్రసంగించే లేక ఉపదేశించే సమయాన్ని ఆరాధనలో తక్కువ కావించునట్లు ఒత్తిడి చేయబడుతుంది. పాటలు పాడడం, ప్రార్థించడం, ప్రభురాత్రి భోజనం చేయడం అనేవాటితో ప్రసంగానికి కేటాయించబడిన సమయాన్ని సమతుల్యంగా చేయడమనే ఆలోచనలో మేలు కన్పించవచ్చు. అదే సమయంలో, దేవుడు ఆరాధికునితో మాట్లాడే ప్రాముఖ్యతను తగ్గించకుండునట్టు మనం జాగ్రత్త వహించాలి. ఇరు పక్షాల ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవరకు ఆరాధన పూర్తి కాదు.

మోషే నాటనుండి, దేవుడు నరులకు తన చిత్తాన్ని బయలుపరచడానికి ఆయన కోరుకున్న పద్ధతి ప్రకటించడం. తన మరణానికి ముందు ధర్మశాస్త్రం యొక్క వర్తింపును మోషే యొక్క ప్రసంగపు పద్ధతిలో ద్వితీయోపదేశకాండము దాఖలు చేయబడింది. అతడు ధర్మశాస్త్రాన్ని తిరిగి చెప్పడం మాత్రమే గాక, ఆ కాలపు ప్రత్యేకమైన పరిస్థితులకు తగినట్టుగా వివరించి వర్తింపజేశాడు. ప్రకటించడం ద్వారా దేవుడు తన ప్రజలను తనవైపుకు పిలవడానికి ప్రవక్తలను పంపాడు. చరిత్రలో అనేక పర్యాయాలు ప్రజలు ధర్మశాస్త్రాన్ని చదవడం అలక్ష్యం చేసినప్పుడు, ప్రవక్తల స్వరాలను అణచినప్పుడు, భ్రష్టత్వమనే తమ చీకటి రాత్రులలోనికి పడిపోయారు. ఆలాటి చీకటి రాత్రులలో ఒకటి యూదాకు 70 సంవత్సరాల కాలం నిలిచింది.

70 సంవత్సరాల బబులోను చెరానంతరం, దేవుడు జెరుబ్బాబెలు, ఎజ్రా, నెహెమ్యాలను లేపాడు. వారి ద్వారా ఆయన తన ప్రజలను యెరూషలేమునకు తిరిగి కొనిపోయి, దేవాలయాన్ని మరల కట్టింపజేశాడు. ఆ నాయకులు ఇశ్రాయేలు జాతీయమైన, ఆత్మసంబంధమైన జీవితాన్ని పునరుద్ధరించారు. ఆ పని మధ్యలో ఆగిపోయినప్పుడు, దేవుడు హగ్గయి, జెకర్యా అనే ప్రవక్తలను పంపి దేవుడు వారిని తిరిగి పనిలోనికి పిలిచాడు (ఎజ్రా 4:24–5:2). దేవుని వాక్యానికి తిరిగి రాకుండ పునరుద్ధరణ జరిగేది కాదు.

ఆ దినాల్లో, ప్రతి ఇంట్లో రాసిన వాక్యపు ప్రతి ఉండేది కాదు. కష్టపడి చూచి వ్రాత వ్రాయడంవలననే ప్రతి సాధ్యపడేది. కొన్ని ప్రతులు మాత్రమే లభించేవి, అవి కూడ శాస్త్రుల వద్దను, మత నాయకుల వద్ద మాత్రమే ఉండేవి. బబులోనులో ఉండగా,

దేవుని వాక్యం వినకుండ దేవుని ప్రజలు చాలా కాలము జీవించారు. యెరూషలేము ప్రాకారపు గోడలు పూర్తి చేయబడిన తరువాత, ధర్మశాస్త్రము చదువబడగా వినునట్లు తిరిగి వచ్చిన ప్రజలు సమకూర్చబడ్డారు. ఎజ్రాతో పాటు పదముగ్గురు మనుష్యులు నిలిచి, వినినదానిని జనులు బాగుగా గ్రహించునట్లు దానికి అర్థము చెప్పిరి. ఎజ్రా ఉదయమంతా, మధ్యాహన్నంవరకు చదివాడు, జనులు శ్రద్ధగా ఆలకించారు. దేవుని వాక్యము చదువబడగా, వారు ఏడ్చిరి. దేవుని వాక్యము వారి హృదయములను ఒప్పించినట్టుంది. ఆయన చిత్తానికి అనుగుణంగా వారు మార్చుకోవలసిన అవసరతను ఒప్పింపజేసింది (నెహెమ్యా 8:1–9).

దేవుని కుమారుడు ప్రసంగియై ఉండడంలో ప్రసంగించడం యొక్క ప్రాముఖ్యత గోచరిస్తుంది. ఆయన అపొస్తలులు కూడ ప్రసంగికులే, ప్రసంగించటం ద్వారా తొలిగా క్రైస్తవ్యానికి మార్పు చెందారు (అపొస్తలుల కార్యములు 2). క్రీస్తువారి చివరి ఆదేశం సర్వలోకానికి వెళ్లి సమస్త జనులను శిష్యులుగా చేస్తూ, (తన అపొస్తలులకు) ఆయన ఏయే సంగతులు ఆజ్ఞాపించారో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించడమైయుంది (మత్తయి 28:18–20). తాను "సువార్త ప్రకటించుటకే" పంపబడినట్లు అపొస్తలుడైన పౌలు స్థిరంగా చెప్పాడు (1 కొరింథీయులకు 1:17ఎ). ఏలయనగా "సువార్త ప్రకటనయను వెఱ్ఱితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్ప మాయెను" (1 కొరింథీయులకు 1:21). స్థానిక సంఘాలు సువార్త ప్రకటనవలన నాడు, నేడును నాటబడ్డాయి.

సంఘంలో దేవుడు ఏర్పరచిన అయిదు అవసరమైన పాత్రలు (అపొస్తలులు, ప్రవక్తలు, సువార్తికులు, కాపరులు, మరియు ఉపదేశకులు; ఎఫెసీయులకు 4:13) ఉపదేశించే, ప్రసంగించే పాత్రలే. పౌలు తిమోతికి యిలా ఆదేశించాడు: "వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధి చెప్పుము" (2 తిమోతి 4:2). ప్రసంగించటాన్ని లేక ఉపదేశించటాన్ని తగ్గించడం దేవుని స్వరం దేనిచేత వినిపించ బడుతుందో దానిని తగ్గించడమైయుంటుంది.

## మన త్రోవకు వెలుగునిచ్చుట

రచన రూపంలో క్రొత్త నిబంధన వ్రాయబడక పూర్వం దేవుని వాక్యముపై ప్రసంగించడం చాలా ఆవశ్యకమై ఉండేది. సంఘం బాల్య దశలో ఉంది, నేర్చుకోవలసింది ఎంతో ఉంది. దేవుడు తన వాక్యాన్ని దైవప్రేరేపితులగు అపొస్తలులు, ప్రవక్తలు అనేవారి ద్వారా బయలుపరచుతున్నాడు. జనులు వినడానికి వేగిరపడుతున్నారు; కాని దేవుడు చెప్పదలచుకున్నది వినడానికి అవకాశాలు మాత్రం తక్కువగా ఉన్నాయి.

నేడు వాక్యం యొక్క అవసరత తక్కువగా ఉందా? ఉపదేశింపబడే వాక్యాన్ని తక్కువ చేసినట్టయితే, మరొక భ్రష్టత్వపు రాత్రిలోనికి మనం నడిపింపబడే అవకాశముందా? మాట్లాడే వాక్యాన్ని తగ్గించితే, మన ఆరాధన వృద్ధినొంది, మనం ఎక్కువగా దేవునికి

సన్నిహితులమౌతామా? దావీదు యిలా అన్నాడు: "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునైయున్నది" (కీర్తనలు 119:105). జీవితం గుండా నడిచిపోవడం అంటే చీకట్లో పేలుడు "మందు పాతరల క్షేత్రం" గుండా నడిచిపోయినట్టుంటుంది. క్షేమమైన మార్గానికి సైన్ బోర్డులు పెట్టారు, కాని మార్గంలో క్షేమంగా పయనించడానికి మంచి వెలుగు అవసరమైయుంది. ఆ "మందుపాతరలున్న" (ప్రేలుడు పదార్థాలు కప్పబడియున్న) దానిలోగుండా మనం గుడ్డి వెలుగుతో లేక వెలుగే లేకుండ క్షేమంగా పయనించగలమా? ఆ సైన్ బోర్డులు స్పష్టంగా చూడడానికి శత్రువు యొక్క ఏ అపాయ ఛాయలనైనా పసికట్టడానికి ప్రకాశమానమైన వెలుగు నాకు కావాలి! ఈ మార్గం గుండా నడిపించడానికి పనికి వచ్చే ఒకే వెలుగు దేవుని వాక్యం. ఈ జీవితం గుండా వెళ్ల ప్రయత్నించేవాడు ఈ వెలుగు లేకుండా వెళ్లగోరితే అపాయకరంగా సిద్ధపాటు లేనివాడైయున్నాడు.

ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో, మిక్కిలిగా భయపడే పాముల్లో ఊదుడు కట్లపాము ఒకటి. ఈ పాము పగటివేళ అరుదుగా కన్పిస్తుంది, రాత్రివేళల్లో అది బయటికి వస్తుంది. లావుగా ఉన్న ఈ పాము తన పెద్ద శరీరాన్ని భయంకరమైన ప్రయాసతో మెల్లగా లాగుకొంటూ పోతుంది. గనుక మనుష్యులు నడిచి బాట ఏర్పడిన మార్గంలో అది వెళ్లుతుంది. ఈ ఊదుడు కట్లపాము అరుదుగా కరుస్తుంది. దాన్ని ఏమీ చేయకపోతే మనుష్యుల జోలికి రాదు కాని, చీకటి రాత్రులలో పామును కానక దానిమీద కాలువేస్తే అది భయంకరంగా కాటువేస్తుంది. అలా కరవబడిన వ్యక్తి చావకపోవచ్చుగాని, అతడు తన పాదాన్ని గాని, కాలునుగాని పోగొట్టుకోవచ్చు. ఆ కాటువలన ఏర్పడే గాయం మానడం బహు కష్టమౌతుంది. కొన్నిసార్లు దాని విషాన్ని తొలిగించడానికి శరీరంలో అవయవాన్ని తీసివేయవలసియుంటుంది. అతని చేతిలో టార్చ్‌లైట్ లేకుండగనైనా, నడిచే దారిలో తగినంత చంద్రుని వెలుగు లేకుండనైనా ప్రయాణం చేయడం అపాయకరం. ఆత్మసంబంధంగా మాట్లాడాలంటే, ఆరాధన మన జ్యోతులను తిరిగి వెలిగించాలి. మన బ్యాటరీలకు రీచార్జ్ చేయించాలి, మన దీపాలను శుద్ధిచేసి ఉంచుకోవాలి. మన ఆరాధనా సమయంలో వాక్యాన్ని వినడం కంటె ఎక్కువగా ఏదియు ఈ పని సాధించలేదు.

## మన నిజ స్వభావాన్ని ప్రతిఫలింపజేయడం

పునరుద్ధరింపబడినప్పుడు యూదా దేవుని వాక్య పఠనాన్ని, దాని వివరణను ఆలకించినట్టు మనం ముందుగానే చూచాం (నెహెమ్యా 8), వారు ఏడ్చారు. వాక్యం చూపిన వెలుగులోనికి వచ్చినప్పుడు కొందరు ఎందుకు ఏడుస్తారో, కొందరు ఎందుకు ఏడ్వరో యాకోబు 1:21-25 వివరిస్తుంది. దేవుని చూడడానికి తెరువబడిన ఒకే కిటికీగా మాత్రమే గాక, ఈ జీవన ప్రయాణంలో మనకు త్రోవ చూపే వెలుగుగాను వాక్యం ఉండడం మాత్రమే గాక, మన నిజ స్వభావాన్ని ప్రతిబింబింపజేసే అద్దమైయుంది. "లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించినట్టయితే," కేవలం మనం "వాక్యాన్ని వినువారము మాత్రమే గాక వాక్య

ప్రకారము ప్రవర్తించువారమై ఉంటాం.” మరోవైపు, “వాక్యమును వినువాడైయుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే, ... వాడు అద్దములో తన సహజముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు,” వాడు అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా (యాకోబు 1:21–24). వాక్యము తన స్వభావాన్ని అతనికి బయలుపరచినా, దాన్ని అతడు లక్ష్యపెట్టలేదు. అతడేవిధంగా ఒప్పింపబడడం లేదు, తన లోపాలను దిద్దుకునే ఏ తీర్మానం లేదు, తన స్థితిని బట్టి పశ్చాత్తాపంతో కూడిన ఏ కన్నీళ్లు లేవు. దేవుని ప్రజలు ధర్మశాస్త్రము చదువబడగా వినినప్పుడు, వారు నిజంగా ఏమైయున్నారో అలా తమ్మును తాము చూచుకున్నారు, తమకు కన్పించిన స్థితిలో వారు నిలవడానికి యిష్టపడలేదు. దేవుని ఆజ్ఞలను పాటించడంలేదన్న వాస్తవం వారిని దుఃఖపెట్టింది.

మన మార్గాన్ని వెలిగించే అదే వెలుగు కూడ మన దోషాలను ఎత్తి చూపుతోంది. అది మనమీదను మనముందున్న మార్గం మీదను ప్రకాశిస్తుంది. మనం ఆ వెలుగుకు ఎంత సమీపంగా వస్తామో, మన దోషాలు అంత స్పష్టంగా బయటపడతాయి. మనం వెలుగును తప్పించి మన మచ్చలను మనం దాచుకోవచ్చు లేదా మనం వెలుగును సమీపించి మన లోపాలను గుర్తించి ప్రభువుచే సరిచేయబడ కోరవచ్చు. ప్రసంగం లేక ఉపదేశం ద్వారా జరిగే ఆరాధన మనలను వాక్యపు వెలుగు ముందుకు తెస్తుంది.

## మన విశ్వాసము వృద్ధియగుట

రోమా 10:17 యిలా అంటుంది, “కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తునుగూర్చిన మాటవలన కలుగును.” దేవునియందలి నిజమైన విశ్వాసము ఆయన వాక్య జ్ఞానమువలన కలుగుతుంది. ప్రభువైన యేసు తన శిష్యులకొరకైన ప్రార్థనలో “నీ వాక్యమే సత్యము” అని ఆయన అన్నారు (యోహాను 17:17బి). “నీతి వాక్య విషయములో అనుభవము లేనివారైయున్నందున” హెబ్రీ క్రైస్తవులు ఇంకనూ శిశువులుగానే ఉన్నట్టు నేరారోపణ చేయబడ్డారు (హెబ్రీయులకు 5:13బి). “కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొనిపోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెను” అని రచయిత ముందుగా వారికి చెప్పాడు (హెబ్రీయులకు 2:1).

దేవుని వాక్యం ఎదుటికి మానక రాకున్నట్టయితే, మనము ప్రభువునందు ఎదుగము. వాక్యము ఆత్మకు భోజనమైయుంది. దేవుని కుమారుని గూర్చిన జ్ఞానము మాత్రమే కోరదగిన పరిపక్వపు స్థాయికి మనలను చేర్చుతుంది, అది “క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత” (ఎఫెసీయులకు 4:12). పౌలు యిలా అన్నాడు,

> అందువలన మనమికమీదట పసిపిల్లలమైయుండి, ... ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొనిపోవుచు అలలచేత ఎగురగొట్టబడినవారమైనట్లుండక, ప్రేమ గలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము (ఎఫెసీయులకు 4:14, 15).

వాక్యమును స్వీకరించి ఆరాధించుట – క్రీస్తునందు అన్ని విషయములలో ఎదుగుటకు యిది గొప్ప మార్గము.

## ముగింపు

"తక్కువ ప్రసంగించడం, ఎక్కువ ఆరాధన" అనే వాదము కొన్నిసార్లు క్రైస్తవుల నడుమ ఉంటుంది. ఈలాటి వాదంలో గుప్తమయ్యిందేమంటే – ప్రసంగించడం లేక ఉపదేశము ఆరాధన కాదని. బైబిలు ప్రీచింగ్ ఆరాధన సందర్భంగా భావించవలసి యుంటుంది. ఆరాధన కొరకైన సంఘ కూడిక వాక్య పఠనకు, ప్రకటనకు బహుగా అనుకూలమైన వాతావరణాన్ని కలిగించాలి. నలిగి విరిగిన హృదయాలతో దేవుని ఆరాధించేవారి హృదయాల్లో దేవుని వాక్యం గొప్పగా స్వీకరింపబడవలసియుంటుంది.

విత్తువాని ఉపమానాన్ని యేసు చెప్పినమీదట, ప్రశ్నించిన తన శిష్యులకు వివరిస్తూ యేసు యిలా అన్నారు, "విత్తనము దేవుని వాక్యము" (లూకా 8:11బి). ఈ ఉపమానాన్ని "హృదయముల ఉపమానము" అని పిలవాలి. విత్తనాన్ని వెదజల్లడాన్ని గూర్చి యేసు నిజంగా ఈ ఉపమానాన్ని చెప్పలేదు, కాని వాక్యాన్ని స్వీకరించే హృదయపు స్థితిని గూర్చి ఆయన ఉపదేశించారు. విత్తనాలు ప్రతిచోట చల్లబడ్డాయి. అన్ని రకాలైన నేలలమీద పడ్డాయి, అది అన్ని రకాలైన హృదయాలను ప్రతిబింబింపజేస్తుంది. మంచి నేల, లేక హృదయము, విత్తనాన్ని స్వీకరించేది, మొలకెత్తేది, పండేది. ఇది యథార్థంగా దేవుని ఆరాధించే నిజమైన హృదయమైయుండాలి.